సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



మెరుగయ్యారు కానీ..

ఇంటర్ ఫలితాల్లో జిల్లా 67 శాతం ఉత్తీర్ణత సాధించింది. అయితే రాష్ట్రస్థాయిలో మాత్రం కాస్త వెనుకబడింది. - 8లో



నూతన ఆవిష్కరణలపై దృష్టి

ట్రిపుల్ ఐటీలో టెక్నె వెర్స్ ప్రారంభమైంది. డ్రోన్ల సాంకేతికతపై వివరించారు. - 8లో

నేడు సంతకాల సేకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వీప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సెవెన్ రోడ్ జంక్షన్ వద్ద శనివారం ఉదయం 8 గంటలకు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది. అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

కొత్త ఇళ్లు.. కొంగొత్త రోడ్లు..



రూ. ఐదు కోట్లతో నిర్మించిన బొంతలకోడూరు తారు రోడ్డు

- నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 113 జగనన్న కాలనీ లే అవుట్లు వేశారు. 3484 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు.
- మరో పక్క సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి 7214 మందికి మంజూరు చేశారు. రూ. 161 కోట్లు వరకు పేద ప్రజలకు లబ్ధి చేకూరింది.
- రణస్థలం మండలం జీరు పాలేం నుంచి జాతీయ రహదారి వరకు రూ. 8 కోట్లతో తారు రోడ్డు నిర్మించారు.
- పొన్నాడ నుంచి బొంతల కోడూరు వరకు రూ. 5 కోట్లతో తారు రోడ్డు వేశారు.
- రూ. 25 కోట్లతో నియోజక వర్గంలో తారురోడ్లు వేశారు.
- మండల పరిషత్ నిధులు, ఏఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో రోడ్లు వేశారు.
- నియోజకవర్గ వ్యాప్తంగా రూ.130 కోట్లతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కలెక్షన్ సెంటర్లు నిర్మించారు.



ఆర్‌జీయూకేటీలో నిర్మాణంలో భవనాలు



ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రూ.34 కోట్లతో నిర్మిస్తున్న పరిపాలన భవనం

బుడగుట్లపాలెం సముద్ర తీరం (ఇన్‌సెట్లో) ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు



హార్బర్ సాక్షిగా అభివృద్ధి జోరుగా..

సువిశాల సముద్ర తీరం..అందుకు అనుగుణంగా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం. అత్యున్నత విద్యా సంస్థలు.. వాటిని బలోపేతం చేస్తూ వందల కోట్లతో ఆధునీకీకరణ. మారుమూల గ్రామాలు.. అక్కడ మౌలిక వసతుల పెంపు కోసం సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు. అతిపెద్ద పారిశ్రామిక వాడ.. స్థానికులకు ఉద్యోగాలు లభించేలా చర్యలు. కొత్తగా జగనన్న ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ బడులకు మరమ్మతులు, తారు రోడ్ల ఏర్పాటు, సచివాలయాల సేవలతో.. ఎచ్చెర్ల నలుగురూ మెచ్చేలా ఎదిగింది. నియోజకవర్గం నలుచెరగులా సంక్షేమ సంతకాలు కనిపించేలా వైఎస్ జగన్ ప్రభుత్వం పనిచేసి చూపించింది.

- ఎచ్చెర్ల నలుచెరగులా అభివృద్ధి పనులు
- విద్యా సంస్థల ఆధునికీకరణకు పెద్దపీట
- బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు
- రూ.882 కోట్లతో నియోజకవర్గవ్యాప్తంగా అభివృద్ధి పనులు
- రూ.1578 కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి



ఎచ్చెర్ల క్యాంపస్:

అతిపెద్ద పారిశ్రామిక వాడ, సువిశాల సముద్ర తీరం, అత్యున్నత విద్యా సంస్థలతో జిల్లాలోనే ప్రత్యేకంగా ఉండే ఎచ్చెర్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుపమాన రీతిలో ప్రగతిని పరుగులు పెట్టించింది. 100 గ్రామ సచివాలయాల పరిధిలో అనేకానేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపించింది. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నిరంతరం ప్రజల్లో ఉండి, ప్రజా సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చారు.

రూ.34 కోట్లతో పరిపాలన భవనం నిర్మాణం

అంతర్గత రోడ్లను ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించారు.

నాడు-నేడు ఫేజ్ 1, 2లో పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించారు.

నియోజకవర్గంలో 363 పాఠశాలలు ఉండగా, 252 స్కూళ్లలో మౌలిక వసతులు

రూ.85 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి చేశారు.

ఉన్నత చదువుల కోసం..

- ప్రతిష్టాత్మక విద్యా సంస్థ రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎం పురం క్యాంపస్‌లో సివిల్ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు. రూ.167 కోట్లతో భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.
- బీఆర్ఏయూలో రూ.16 కోట్లతో బాలుర వసతి గృహం నిర్మించారు. దీన్ని వర్చువల్‌గా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు.



ఎచ్చెర్లలో నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల



నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన పాతర్లపల్లి ప్రాథమిక పాఠశాల

'గడపగడపకూ' ప్రగతి



అర్జున వలస గ్రామ సచివాలయం

నియోజకవర్గంలో వంద సచివాలయాల పరిధిలో 248 రోజుల పాటు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించారు. దీంతో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున రూ.2 కోట్ల ప్రత్యేక నిధులు కూడా రాబట్టుకుని వాటితో స్థానిక సమస్యలను పరిష్కరించారు. జల జీవన్ మిషన్‌లో ఎంపిక చేసిన గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు.



ఎచ్చెర్లలో రూ. 20 లక్షలతో నిర్మించిన సిమ్మెంట్ రోడ్డు

పూర్తిస్థాయిలో అభివృద్ధి



నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేశాం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశాం. పైడిభీమవరం, ఎచ్చెర్ల ప్రాంతాల్లోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాం. తోటపల్లి, నారాయణపురం, మడ్డు వలస ప్రాజెక్టు కింద శివారు భూములకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకున్నాం. గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి, సమస్యలు గుర్తించి సచివాలయానికి రూ. 20 లక్షలు ఖర్చుతో పనులు చేశాం. అవసరమైన తారు రోడ్లు, సిమ్మెంటు రోడ్లు నిర్మించాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధి చేశాం. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల స్వరూపం మార్చగలిగాం. పేద కుటుంబాల సొంతింటి కల నెరవేర్చాం. ఏ ప్రభుత్వం చేయని మేలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపించింది.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

తీరానికి మణిహారంలా..

మత్స్యకారుల వలసల నిర్మూలన లక్ష్యంగా బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ. 365 కోట్లతో సాగరమాల ప్రాజెక్టు కింద, విశ్వసముద్ర సంస్థ ఈ నిర్మాణం చేపడుతోంది. పూర్తయితే మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.



బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు

వైఎస్సార్‌సీపీ హయాంలో లబ్ధి (కొన్ని పథకాలు)

పథకం	లబ్ధిదారులు	లబ్ధి
జగనన్న అమ్మ ఒడి	38,559	రూ.146.07 కోట్లు
జగనన్న విద్యా దీవెన	23,087	రూ.47.43 కోట్లు
జగనన్న వసతి దీవెన	18,608	రూ.25.19 కోట్లు
విదేశీ విద్యా దీవెన	233	రూ.26.17 లక్షలు
వైఎస్సార్ రైతు భరోసా	48,062	రూ.233.42 కోట్లు
వైఎస్సార్ పంటల బీమా	12,502	రూ.24.22 కోట్లు
వైఎస్సార్ సున్నా వడ్డీ పంటరుణాలు	6,060	రూ. 14.16 కోట్లు
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	1262	రూ.66.77 లక్షలు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	5,217	రూ. 26.47 కోట్లు
వైఎస్సార్ పింఛన్ కానుక	46,401	రూ. 530 కోట్లు
వైఎస్సార్ చేయూత	24,809	రూ.717.22 కోట్లు
వైఎస్సార్ ఆసరా	65,885	రూ.169 కోట్లు
వైఎస్సార్ ఎస్‌హెచ్‌జీ సున్నా వడ్డీ	79,424	రూ.20.75 కోట్లు
వైఎస్సార్ కాపు నేస్తం	3,209	రూ.8.46 కోట్లు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	1783	రూ. 5.76 కోట్లు
వైఎస్సార్ కల్యాణ మస్తు-షాదీ తోఫా	644	రూ.3.27 కోట్లు
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	14,831	రూ.38.09 కోట్లు
వైఎస్సార్ ఆసరా	10,275	రూ.8.76 కోట్లు
ఇంటి బిల్లులు చెల్లింపు	8,015	రూ.92.65 కోట్లు
వైఎస్సార్ బీమా	1229	రూ.10. 54 కోట్లు
వైఎస్సార్ వాహన మిత్ర	3,174	రూ.11.20 కోట్లు
వైఎస్సార్ నేతన్న నేస్తం	538	రూ.2.19 లక్షలు
జగనన్న చేదోడు	2,017	రూ.66.75 కోట్లు
తెల్లరేషన్ కార్డు కోవిడ్ సహాయం	81,087	రూ.25.48 కోట్లు
జగనన్న తోడు వడ్డీ చెల్లింపు	6,134	రూ.36.26 లక్షలు

విజయ దుందుభి మోగిద్దాం

- మరో 10 రోజుల్లో జిల్లాకు సీఎం బస్సు యాత్ర: ఎంపీ వైవీ సుబ్బారెడ్డి
- ఎవరినీ తక్కువ అంచనా వేయొద్దు: స్పీకర్ తమ్మినేని
- చంద్రబాబు నిర్వాకం వల్లే పింఛన్లకు కష్టాలు : మంత్రి ధర్మాన
- సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ వైపే: మంత్రి సీదిరి
- విశాఖలోనే సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం: మజ్జి శ్రీనివాసరావు
- వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో నాయకుల దిశానిర్దేశం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

పోలింగ్‌కు ఇంకా ముప్పై రోజుల సమయం ఉందని, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కష్టపడి పనిచేస్తే విజయ దుందుభి మోగించగలమని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏ విధంగా విస్మరించారో అందరికీ గుర్తు చేయాలన్నారు. 2019 నుంచి సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమాన్ని కూడా ప్రచారం చేయాలని సూచించారు. మరో పది రోజుల్లో జిల్లాకు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర జిల్లాకు చేరుకోనుందని మీరంతా సిద్ధంగా ఉండాలని పార్టీ కేడర్‌కు, నాయుకులకు దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఆనందమయి ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా దివంగత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కార్పొరేషన్ల చైర్మన్లు, అనుబంధవిభాగాల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, దుంపల రామారావు, డీపీ దేవ్, రాజాపు హైమావతి, ఎంవీ స్వరూప్, కరిమి రాజేశ్వరరావు, గొండు కృష్ణ, ఎంవీ పద్మావతి, రొత్తు శంకరరావు, శిమ్మ రాజశేఖర్, పొన్నాడ రుషి, మీసాల నీలకంఠంనాయుడు, ఎన్ని ధనుంజయ రావు, బల్లాడ హేమమాలిని, కాయల వెంకటరెడ్డి, తమ్మినేని చిరంజీవినాగ్, కిల్లి రామ్మోహన్, కోనాడ నర్సింగరావు, చింతాడ మంజు, పిట్ట దామోదర రావు, కోణార్క్ శ్రీనులతో పాటు జిల్లాలో ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. హాజరైన నాయకులు

దమ్మున్న నాయకుడు జగన్



మంచి జరిగితేనే మాకు ఓటు వెయ్యండి.. లేదంటే లేదు అని చెప్పగలిగే ఒకే ఒక దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మూడు కాదు ముప్పై పార్టీలు ఏకమైనా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదే.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

టీడీపీ తుడిచిపెట్టుకుపోవాలి



జిల్లాను కింజరాపు కుటుంబం చాలాకాలంగా పాలిస్తున్నా ఒక్క మంచి పని కూడా చేయలేదు. ఈ ఎన్నికలతో జిల్లాలో టీడీపీ తుడిచిపెట్టుకుని పోవాలి. ఉద్దేశపూర్వకంగానే ఈనాడు, ఏబీఎన్, టీవీ-5లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. వారు ఎన్ని కుయుక్తులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరు. కలిసికట్టుగా పనిచేసి ఎంపీ స్థానాన్ని గెలవాలి.

– పేరాడ తిలక్, ఎంపీ అభ్యర్థి

టీడీపీ భూస్థాపితం ఖాయం



సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో అందరికీ సేవలు అందించగలిగాం. ఈ ఎన్నికలతో టీడీపీ భూస్థాపితం అవ్వడం ఖాయం.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

పార్టీ కోసం పనిచేయండి



నాయకత్వం రుజువు చేసుకునేందుకు ఎన్నికలే సరైన వేదికలు. పార్టీ కోసం పనిచేస్తే సరైన లీడర్‌గా గుర్తింపు వస్తుంది. ప్రజా జీవితంలో నేను వంద శాతం సంతృప్తిగా ఉన్నాను. చంద్రబాబు వల్లనే వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ల కష్టాలు ఎదురయ్యాయి. జిల్లాలో 8కి 8 స్థానాలతోపాటు ఎంపీ స్థానంలోనూ మనమే గెలుస్తాం.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి

తక్కువ అంచనా వేయొద్దు



విపక్షాలకు కూడా ఎవరి వ్యూహం వారికి ఉంటుంది. ఎవరినీ తక్కువ అంచనా వేయొద్దు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తే పార్టీ గెలుపు సులభమవుతుంది. రెండు సార్లు ఎంపీగా చేసిన రామ్మోహన్ నాయుడు కేంద్రం ఇచ్చిన పథకాలు తానే ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నాడు. అలాంటి వాటిని ఎవరూ నమ్మవద్దు.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

మనమే గెలుస్తాం..



దేశవ్యాప్తంగా సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని చెబుతున్నాయి. పేదలు సైతం సీఎం వైఎస్ జగన్‌కు మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలి. అప్పుడే ప్రతిపక్షాలను తరిమేయగలం. ఎంపీగా రామ్మోహన్‌నాయుడు రైల్వే స్టేషన్లలో బెంచీలు వేయడం తప్ప ఇంకేం చేయలేదు. పేరాడ తిలక్‌ను గెలిపించాలి.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు,మంత్రి


ఉత్తరాంధ్రను అభివృద్ధి చేద్దాం



ఉత్తరాంధ్ర అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విమర్శించడానికి ఏమీ లేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. విశాఖలో రాజధాని ఏర్పాటుచేసి 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిచి అక్కడే ప్రమాణస్వీకారం చేస్తారు. బూత్‌లెవెల్ పోల్ మేనేజ్‌మెంట్ ప్రతి ఒక్కరు సక్రమంగా చేయాలి. వలంటీర్లను ఇష్టం వచ్చినట్లు తిట్టిన చంద్రబాబునాయుడు ఇప్పుడు రూ.10వేలు ఇస్తానని మోసం చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఆయన మాటలు ఎవ్వరూ నమ్మరు.

– మజ్జి శ్రీనివాసరావు, పార్టీ ఉత్తరాంధ్ర డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్

దేశంలోనే నంబర్ వన్



అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దింది సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. అవినీతి లేని రాష్ట్రంగా తీర్చిదిద్దారు. మహిళా సాధికారత వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుంది.

– రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి



గ్రామగ్రామాన వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి. వలంటీర్లను కించపరిచిన చంద్రబాబు, పవన్‌లు ఇప్పుడు కపట ప్రేమ చూపిస్తున్నారు.

– గొర్లె కిరణ్ కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

క్లీన్‌స్వీప్ చేద్దాం..



జగనన్నను గెలిపిస్తే రాష్ట్రంలో భావి తరాలకు బంగారు భవిష్యత్ ఉంటుంది. ఈ ఎన్నికల్లో అంతా కలిసికట్టుగా పనిచేసి క్లీన్‌స్వీప్ చేద్దాం. మనవైపు దేశమంతా తిరిగి చూసేలా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేశాం.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

ఇచ్ఛాపురం సీటు గెలుద్దాం



ఇచ్ఛాపురం సీటును గెలిచి సీఎం వైఎస్ జగన్‌కు కానుకగా ఇద్దాం. బీసీలంటే బ్యాక్‌వర్డ్‌కాదని బ్యాక్‌బోన్ అని నిరూపించింది జగనన్న. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్

కంచుకోట బద్దలవ్వాలి..



ఈ ఐదేళ్లలో మన జిల్లాలో రూ.20వేల కోట్లతో ప్రభుత్వం చాలా పనులు చేసింది. టీడీపీ 40 ఏళ్ల కంచుకోటలు ఈసారి బద్దలుగొడదాం. మూలపేట పోర్టును మరో 10 నెలల్లో పూర్తి చేసి 20వేల ఉద్యోగాలిస్తాం. కరోనాలో దేశవ్యాప్తంగా చేతులెత్తేస్తే ఏపీలో మాత్రం అన్ని రకాల మందులు, టెస్టులు చేసి సమర్థంగా ఎదుర్కొన్నారు.

– దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ

క్లుప్తంగా

గంజాయి పట్టివేత

టెక్కలి రూరల్: స్థానిక నాలుగురోడ్లు జంక్షన్ మెళియాపుట్టి రోడ్డులో శుక్రవారం వాహన తనిఖీల్లో 1.3 కిలోల గంజాయిని టెక్కలి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కూర్మనాథపురం గ్రామానికి చెందిన కోట గణేష్ అనే వ్యక్తి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అతను ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి వెళ్లి అక్కడ కె.మణికంఠ, కూన చింతాని అనే ఇద్దరు వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి తిరిగి టెక్కలి వస్తుండగా సీఐ పైడయ్య జరిపిన వాహన తనిఖీల్లో దొరికిపోయాడు. వారిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

16న భద్రాచలంకు ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో భద్రాచలంకు ఆర్టీసీ బస్సులు నడపనుందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు తెలిపారు. ఈనెల 16వ తేదీన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి భద్రాచలంకు మొట్టమొదటిసారిగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. భద్రాచలంకు వెళ్లే భక్తులు తమ టికెట్‌లు, ఇతర వివరాలకు 7382921647, 7382919694 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రామభక్తులు, ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



మదనాపురం జంక్షన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

బూర్జ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. మండలంలో గల మదనాపురం జంక్షన్‌లో ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆమె శుక్రవారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, సిబ్బంది సమయ పాలనపై ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించారు. ప్రధానంగా అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం – పాలకొండ రహదారిపై వస్తున్న వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరు, వీడియో రికార్డింగ్ చేస్తున్న విధానాలపై సిబ్బందిని అడిగి తెలుసుకొని పలు సూచనలు, సలహాలు అందజేశారు.

అమ్మో కోతులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలో చిన్నబొందిలీపురం, బొందిలీపురం, రాయివీధి తదితర ప్రాంతాల్లో కోతుల గుంపు ప్రజలను ఇబ్బంది పెడుతోంది. పది రోజులుగా కోతులు ఆ ప్రాంతంలోకి వచ్చి తిష్ట వేశాయి. ఇళ్లలోకి దూరి ఆహారాన్ని తినేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు, మహిళలపై దాడులకు కూడా దిగాయని అంటున్నారు. రెండు నెలల పసికందుపై కూడా ఓ కోతి దాడి చేసిందని తెలిపారు. అటవీశాఖ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని డీసీసీబీ కాలనీలో నివాసం ఉంటున్న కింతలి శ్రీవాణి (30) ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకొంది. రూరల్ పోలీసులు అందించిన వివరాలు మేరకు.. శ్రీవాణి, ఆమె భర్త హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేసేవారు. కోవిడ్ తర్వాత వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలో ఇంటి వద్దే పనిచేస్తున్నారు. అయితే ఆమెకు పిల్లలు లేకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. భర్త హరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొదటి విడత ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్దేశిత వెబ్‌సైట్‌లో శుక్రవారం పూర్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈవీఎం గోదాం వద్ద ప్రక్రియ నిర్వహించారు. ఈవీఎంలు ఈ నెల 21, 22 తేదీల్లో ఆయా నియోజకవర్గాలకు చేరవేయనున్నామని ఆయన తెలిపారు. ఈ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈవీఎంల పరిశీలన అనంతరం ఆయన పార్టీ ప్రతినిధులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, ఈవీఎంల నోడల్ అధికారి జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధా, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ జయప్రకాశ్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

మెరుగయ్యారు కానీ..

- ఇంటర్మీడియెట్ ఫలితాలు వెల్లడి
- గతంతో పోలిస్తే ఉత్తీర్ణత శాతం మెరుగు
- అయినా రాష్ట్రస్థాయిలో వెనుకబడిన శ్రీకాకుళం
- రాష్ట్రంలో ఫస్టియర్ ఫలితాల్లో 21వ స్థానం, సెకెండియర్‌లో 24వ స్థానం
- సీనియర్ ఇంటర్‌లో 67 శాతం ఉత్తీర్ణత
- జూనియర్ ఇంటర్‌లో 57 శాతం ఉత్తీర్ణత



ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో శ్రీకాకుళం విద్యార్థులు మెరుగైనా.. రాష్ట్రస్థాయిలో మాత్రం కాస్త వెనుకబడ్డారు. గత ఏడాది 64 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 67 శాతం మంది పాసయ్యారు. ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరగ్గా, స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ మార్చి 18 నుంచి ఏప్రిల్ 4 తేదీ వరకు కొనసాగింది. పరీక్షలు ముగిసిన 22 రోజుల్లోనే రికార్డు స్థాయిలో ఫలితాలు వెల్లడించేలా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకోవడం విశేషం. గత ఏడాది 24 రోజుల్లో ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే.

ఫస్టియర్‌లో 57 శాతం ఉత్తీర్ణత..

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు గత ఏడాదితో పోలిస్తే మెరుగనిపించారు. గత ఏడాది 51 శాతం ఉత్తీర్ణతను సాధించగా ఈ ఏడాది 57 శాతం ఉత్తీర్ణతను సాధించి జిల్లాల పునర్విభజన(26జిల్లాలు) రాష్ట్రంలో 21వ స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరంలో 18,249 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 10,408 మంది ఉత్తీర్ణులయ్యారు.

సెకెండియర్‌లో 67 శాతం ఉత్తీర్ణత..

సీనియర్ ఇంటర్ ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు 67 ఉత్తీర్ణతను సాధించడంతో రాష్ట్రంలో 24వ స్థానంలో నిలిచారు. ఒకేషనల్‌లో మాత్రం జిల్లా ముందు వరుసలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 16,769 మంది హాజరు కాగా 11,300 మంది పాసయ్యారు. ఇక ఎప్పటిలాగే బాలికలే పైచేయి సాధించి, మెరుగైన ఉత్తీర్ణతను సాధించారు.

సర్కారీ కళాశాలలు సో బెటర్..

ప్రైవేటు కళాశాలల కంటే ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి శభాష్ అనిపించారు. ప్రభుత్వం తీసుకున్న వినూత్నమైన చర్యలతోపాటు ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు సమష్టిగా పనిచేసి మంచి ఫలితాలు సాధించారు. నౌపడ, తొగరాం, కింతలి, బారువ తదితర ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులను ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు అభినందించారు.

ఫెయిలైనా నో ప్రోబ్లమ్..

ఫెయిలైన విద్యార్థుల పట్ల ప్రభుత్వం బాసటగా నిలిచింది. ఒకవేళ ఫెయిలై సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు సైతం వారి పాస్ సర్టిఫికెట్/మార్క్స్ మెమోపై 'రెగ్యులర్' అని ఉండేలా చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు సెక్రటరీ సౌరబ్ గౌర్ వెల్లడించారు. పరీక్షలు, మార్కులే జీవితం కాదని.. అవకాశాలు ఎన్నో ఉన్నాయని, విద్యార్థులెవరూ క్షణికావేశాలకు పోవద్దని జిల్లా ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను అక్కున చేర్చుకోవాలని, వారికి ధైర్యాన్ని నింపేలా చొరవ తీసుకోవాలని తల్లిదండ్రులు, సంరక్షకులకు విజ్ఞప్తి చేశారు.

గత 9 ఏళ్లుగా సీనియర్ ఇంటర్ ఫలితాలు ఇలా ఉన్నాయి..

విద్యా సంవత్సరం	ఉత్తీర్ణత శాతం
2015-16	67
2016-17	72
2017-18	65
2018-19	62
2019-20	50
2020-21	100
2021-22	57
2022-23	64
2023-24	67 (ప్రస్తుత ఫలితాలు)



డెకెన్ కమాండింగ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును నిరంతరం పర్యవేక్షించిన ఇంటర్‌బోర్డు జిల్లా అధికారులు

గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ఏపీ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాలు, బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో ఈ ఏడాది మంచి ఇంటర్మీడియెట్‌లో మంచి ఫలితాలు వచ్చాయి. బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఫస్టియర్‌లో 528 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వీరిలో 380 మంది ఉత్తీర్ణులయ్యారు. తామరాపల్లి గురుకులానికి చెందిన భార్గవి ఎంపీసీలో 457 మార్కులు సాధించింది. రెండో సంవత్సరంలో 537 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వీరిలో 452 మంది ఉత్తీర్ణులయ్యారు. కొల్లివలస గురుకులం విద్యార్థి కరుణా సాగర్ ఎంపీసీలో 982 మార్కులు సాధించాడు. అలాగే ఏపీ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మొదటి సంవత్సరం పరీక్షలు 160 మంది రాయగా.. 61 మంది పాసయ్యారు. రెండో సంవత్సరంలో 96 మంది హాజరు కాగా 54 మంది ఉత్తీర్ణులయ్యారు.

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మొదటి సంవత్సరంలో 668 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వీరిలో 409 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో 520 మంది పరీక్షలు రాయగా, వీరిలో 338 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఐఐటీ సూపర్ 60 విద్యార్థులు అదుర్స్



సవర సుజాత (959)



నిమ్మల హర్షవర్ధన్ (953)



సవర ఉపేంద్ర (946)

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని వైటీసీ కేంద్రంగా ఐటీడీఏ సీతంపేట ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఐఐటీ సూపర్ 60 విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అదుర్స్ అనిపించారు. అక్కడ చదువుతున్న 30 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణత సాధించడం విశేషం. వీరిలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపునకు చెందిన సవర సుజాత 1000 మార్కులకుగాను 959 మార్కులు సాధించింది. నిమ్మల హర్షవర్ధన్ 953, కొత్తూరు ఉపేంద్ర 946, అలాగే 900 మార్కులకు పైబడి 11 మంది, 800 మార్కులకుపైబడి 12 మంది, మరో ఏడుగురు 758 పైబడి మార్కులు సాధించడం గమనార్హం. విద్యార్థులతోపాటు వీరిని తీర్చిదిద్దుతున్న అధ్యాపకులను ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, డీడీ అన్న దొరరాజు, గురుకులం సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు మెచ్చుకున్నారు. ప్రిన్సిపాల్ బెండి మురళీబాబు, ఫ్యాకల్టీ సభ్యులు బి.కిరణ్‌కుమార్, కేవీకే శ్రీకాంత్, వైవీ వసంత్‌కుమార్, బి.ప్రభాకర్, డి.శ్రీరామ్మూర్తి, ఎం.నీరజాక్షి, జనార్దన్, కేర్‌టేకర్ కె.శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్.రాంబాబు విద్యార్థులను అభినందించారు.



కవిటి: రాజపురం మోడల్ స్కూల్ విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, సిబ్బంది

సత్తాచాటిన విద్యార్థులు

- సెకెండియర్ ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో శ్రీకాకుళం బైరిసింగుపురం గ్రామానికి చెందిన దమరసింగు ప్రేమ్‌చరణ్ 1000 మార్కులకుగాను 990 మార్కులు సాధించాడు. విద్యార్థి శ్రీకాకుళం శ్రీచైతన్య కళాశాలలో చదివాడు.
- ఎంపీసీ గ్రూపు నుంచే నారాయణ కాలేజ్‌కు చెందిన భోగి సుస్మశ్రీ 986 మార్కులు, అలుపాన సింధు 985 మార్కులు సాధించారు.
- ద్వితీయ సంవత్సరం బైపీసీ గ్రూపు నుంచి 1000 మార్కులకుగాను శ్రీకాకుళం నగరానికి చెందిన బి.సుప్రియ 984 మార్కులతో టాపర్‌గా నిలిచింది. అలాగే సాధు భార్గవి 979 మొదలవలస బిందు భార్గవి 972 మార్కులు సాధించింది.
- ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో కోటబొమ్మాళి మండలం చినబమ్మిడి పంచాయతీ పరిధిలోని సుబ్బారావుపేట గ్రామానికి చెందిన చింతు రేవతి 467 మార్కులు సాధించింది. ఈమె విశాఖలోని శ్రీచైతన్యలో చదువుతోంది.
- శ్రీకాకుళం నారాయణ కళాశాలలో చదువుతున్న వెలమల లీలాకుమారి 466 మార్కులు సాధించింది.
- శ్రీకాకుళం నగరానికి చెందిన ఎంవీవీఎస్ సన్నిత, పి.రాహుల్, లుకలాపు స్నేహ 465 మార్కులు, గురుగుబెల్లి రేణుక, గుండ రేవిప్రియ 464 మార్కులతో మెరిశారు.
- ప్రథమ సంవత్సరం బైపీసీ గ్రూపు నుంచి 440 మార్కులకుగాను జాక భవ్య 433 మార్కులు, పిసిని లిఖిత 431, ఊన్న వినీలకుమారి, మరపట్ల హర్షిత 430 మార్కులతో సత్తాచాటారు.



కవిటి: కొత్తపాలెంలో ప్రతిభ చూపిన విద్యార్థులతో స్పెషల్ ఆఫీసర్ పి.లక్ష్మీదేవి, సిబ్బంది

సూర్యతేజ కళాశాల విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దానేటి పద్మజ

కాశీబుగ్గ: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన సూర్యతేజ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం హెచ్ఈసిలో 484 మార్కులు సాధించిన కోనారి లక్ష్మిప్రియ అభినందనలు అందుకుంది. ఎంపీసీలో 470కి గాను 465 మార్కులు సాధించి బొమ్మాళి వాసవి ప్రతిభ చూపింది. అలాగే ఎంపీసీలో కొత్త లత 464, పూన రోషిణి 464, బెవర రాగసుధ 463, జాగు శ్రీవెంకటజనని 462, మండల పవిత్ర 462, నగిరి హన్సిక 462, బత్తిని హేమంత్ 461, కొవ్వూరు అమృత 460, బైపీసీలో అల్లు శాంతి 430, గొట్టాపు ప్రియాంక 427, కె.పద్మజ 426 మార్కులు సాధించారు. 400కి పైగా 55 మంది మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బత్తిని పల్లవి 1000కి 986 మార్కులు సాధించింది. బైపీసీలో రాయల సాత్విక 985 మార్కులతో సత్తా చాటింది. ఎంపీసీలో రాపాక ప్రసన్న 982, బమ్మిడి దేవకి 981, బైపీసీలో తామాడ హిందు 980, ఎంపీసీలో దట్టి ఐశ్వర్య 977, పొట్నూరు జాహ్నవి 977, బైపీసీలో లింగం పావని 976, పోలాకి శృతి 974, ఎంపీసీలో గేదెల రాగిణి 970 మార్కులు సాధించారు. 900 మార్కులకు పైగా 45 మంది సాధించారు. సూర్యతేజ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో 95 శాతం ఉత్తీర్ణత సాధించినందున కళాశాల ప్రిన్సిపాల్ దానేటి పద్మజి, కరస్పాండెంట్ దానేటి కామేశ్వరరావు అభినందించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన కార్యకర్తలు



పార్టీలో చేరిన వారికి ఆహ్వానం పలుకుతున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం బైపల్లి పంచాయతీలోని తెలుగుదేశం, జనసేన పార్టీ కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. సుమారు 25 మందికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాశీబుగ్గలో జరిగిన కార్యక్రమంలో మోస బాబురావు, డొంక ఉగాది, పరుసుపల్లి రాజేశ్వరి, మైలపల్లి ధనరాజు, తెప్పల రామకృష్ణ, తామాడ అర్జున్, తామాడ రాజేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు మండలం ఎంపీపీ నీలవేణిఉదయ్, వైస్ ఎంపీపీ రాజు, పీఏసీఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ కరుణాకర్, యోగి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



పట్టాలపై హరికృష్ణ మృతదేహం

కాశీబుగ్గ: పలాస రైల్వే స్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ ఎల్‌సీ గేటు రైలు పట్టాలపై శుక్రవారం ఉదయం ఓ యువకుడు చనిపోయిన ఘటన కలకలం రేపింది. పలాస జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేసిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కాశీబుగ్గ ఎల్‌సిగేటు సమీపంలో రైలు పట్టాలపై యువకుడి మృతదేహం ఉందని స్థానికుల నుంచి సమాచారం వచ్చింది. జీఆర్పీ పోలీసులు మృతదేహం వద్దకు చేరుకుని విచారణ ప్రారంభించగా.. మృతుడు పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామానికి చెందిన కూర్మాపు హరికృష్ణ (21)గా తేలింది. వెంటనే అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని గొప్పిలి తరలించారు.

అనుమానాస్పదం..

యువకుడు చనిపోయే ముందు తన సామాజిక మాధ్యమాల ఖాతాల్లో పెట్టిన పోస్టులు అతడి మృతిపై అనుమానం రేకెత్తించేలా చేస్తున్నాయి. యువకుడు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడని, తన ఊరికి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ప్రేమలో పడ్డాడని, కానీ వారి కుటుంబ సభ్యులకు తెలిసి వేధింపులకు గురి చేశారని అతని సన్నిహితులు చెబుతున్నారు. శుక్రవారం మరణించడానికి ముందు ఇన్‌స్టాగామ్‌లో తన ప్రేయసితో ఉన్న ఫొటోలను పోస్టు చేశాడు. దీంతో అతడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుమారుడి మరణంపై తల్లిదండ్రుల బాధను చూసి పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మెల్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఎం.గీతిక



షాలిని పట్నాయక్



కె.నాని



ఎస్ నరేంద్ర



కె.గీతారాణి

హిరమండలం: మండలంలోని కల్లట కార్మెల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో చక్కటి ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 85శాతం, ప్రథమ సంవత్సరంలో 82శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ ఎంపీసీలో ఎం.గీతిక 975, సుశీల్‌కుమార్ పాణిగ్రహి 974 మార్కులు సాధించారు. బైపీసీ గ్రూపులో సాలిని పట్నాయక్ 975, జె.కీర్తన 958 మార్కులు తెచ్చుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో కె.నాని, ఎస్.నరేంద్రలు 451 మార్కులు సాధించి అభినందనలు అందుకున్నారు. కె.వెంకటసాయి 450 మార్కులతో సత్తా చాటాడు. బైపీసీలో కె.గీతారాణి 421 మా ర్కులు సాధించగా.. కె.ఝాన్సీ 408 మార్కులతో ప్రశంసలు అందుకున్నారు.

మంచి మార్కులు సాధించిన వారిని కాలేజీ యాజమాన్యం ఫౌండర్ డాక్టర్ బిస్వజిత్ పాణి, కో ఫౌండర్ సంజు ప్ర బా పాణి డైరెక్టర్ రంజిత్ కుమార్ పాయక్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్ అభినందించారు.

'నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టండి'



డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాపు ప్రారంభిస్తున్న ఎస్ఎంపురం ఆర్‌జీ యూకేటీ క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఎస్ఎంపురం ఆర్‌జీ యూకేటీ క్యాంపస్‌లో మూడు రోజులు నిర్వహించనున్న టెక్నివెర్స్ ఫెస్ట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్ వర్క్‌షాపు నిర్వహించారు. అన్ని రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలకంగా మారిందని అన్నారు. విపత్తుల సమయంలో ఆహార సరఫరా, మందుల సరఫరా వంటి సేవల్లో డ్రోన్‌లు కీలకమన్నారు. ప్రముఖ విద్యా సంస్థలు, పరిశ్రమలు భాగస్వామ్యంతో విద్యార్థులకు డ్రోన్ల తయారీ, పనితీరుపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాలిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ, ఫెస్ట్ కన్వీనర్ వాసు, సహాయ కన్వీనర్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

మంత్రి ధర్మానను కలిసిన మాజీ సైనికులు



మంత్రి ధర్మానను కలిసిన మాజీ సైనికులు

శ్రీకాకుళం రూరల్: మంత్రి ధర్మాన ప్రసాదరావును మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సైనికులు జిల్లాలో ఎంతమంది ఉన్నారు, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుతున్న వసతుల గురించి ధర్మాన అడిగి తెలుసుకున్నారు.

వ్యాను ఢీకొని వృద్ధునికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పొట్టి శ్రీరాములు కూడలి వద్ద శుక్రవారం మధ్యాహ్నం 70 ఏళ్ల వృద్ధుడిని వ్యాను ఢీకొని గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్‌ఐ సందీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గూనపాలెం సమీప కొత్త మేదరవీధికి చెందిన యాదం రమణమూర్తి బోడెమ్మకోవెల వద్ద రంగా చికెన్ సెంటర్‌లో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం షాపు మూసిన వెంటనే ఇంటికి నడుచుకుని వస్తుండగా పొట్టిశ్రీరాములు కూడలి వద్ద వెనుకగా వ్యాను వచ్చి ఢీకొట్టింది. ఎడమకాలు పాదంపై తీవ్రగాయమై రక్తస్రావమైంది. వెంటనే ఆటోలో వృద్ధుడిని రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జోరుగా.. హుషారుగా

జిల్లాలో ఎన్నికల ప్రచారాలు జోరుగా జరుగుతున్నాయి. నాయకులు జనంతో హుషారుగా మాట కలుపుతూ ఓటు అడుగుతున్నారు.



పోలాకి: ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



కొత్తూరు: అడ్డంగి గిరిజన గ్రామంలో వంట చేస్తున్న గిరిజన యువతితో గరిటె తిప్పుతూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



జి.సిగడాం: ఉల్లివలసలో ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్